సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం : 10 : జనవరి : 2023



ఉద్యోగులకు అండగా ఉంటా

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



సీఎం దృష్టికి తీసుకెళ్లండి

వాసాలమర్రి అభివృద్ధి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని పంచాయతీ పాలక వర్గం కలెక్టర్‌కు విన్నవించింది. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0°/14°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహా శివుడికి పూజలు



స్ఫటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. హోమ మండపంలో అగ్ని ప్రతిష్ఠ చేసి రుద్రహవనం, అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. సకల ఆయురారోగ్యాలు, దోష నివారణార్థం రుద్ర హవనం జరిపించినట్లు పూజారులు పేర్కొన్నారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు, గర్భాలయం, ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడి ప్రధానంలో సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర కైంకర్యాలు గావించారు.

యాదాద్రీశుడి సేవలో రఘుమారెడ్డి



శ్రీస్వామి సన్నిధిలో టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, కుటుంబ సభ్యులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలో శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు.

కలెక్టర్‌కు సాహిత్య పుస్తకాల బహూకరణ



పుస్తకాలు అందజేస్తున్న అశోక్‌తేజ

భువనగిరిటౌన్ : ప్రముఖ కవి సుద్దాల అశోక్‌తేజ సోమవారం కలెక్టర్ పమేలా సత్పతిని ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తాను రాసిన సాహిత్య పుస్తకాలను బహూకరించారు. కలెక్టర్ కూడా కవితలు రాస్తారని, కొన్ని సందర్భాల్లో చూసినట్లు అశోక్‌తేజ తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

యాప్‌తో అదనపు భారం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.పోషణ ట్రాకర్ యాప్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లకు సంబంధించిన పనులు ఒకే రకమైనవి కావడంతో అంగన్‌వాడీ టీచర్లపై అదనపు భారం పడుతుందన్నారు. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్‌టీఎస్ యాప్ ద్వారా పనులు నిలివేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిలువేరు రమాకుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బోడ భాగ్యమ్మ ఉన్నారు.

టెన్త్ పరీక్షల్లో చాయిస్ ప్రశ్నలు పెంచాలి

భువనగిరి : పదో తరగతి వార్షిక పరీక్షల్లో చాయిస్ ప్రశ్నలు పెంచాలని కోరుతూ ఎస్ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డీఈఓ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు మాట్లాడుతూ.. 11 పేపర్లకు గాను 6 పేపర్లకు కుదించడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. అయితే ఆబ్జెక్టివ్ ప్రశ్నల్లో ఎలాంటి చాయిస్ లేకుండా ఉందన్నారు. చాయిస్ లేకపోవడం వల్ల విద్యార్థులకు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించాలని కోరారు. డీఈఓకు వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల శివ, భువనగిరి ఉపాధ్యక్షుడు ఎండి నేహాల్, నాయకులు ఈర్ల రాహుల్, కార్తీక్ ఉన్నారు.

తెరపైకి మరో మండలం

సుద్దాల గ్రామాన్ని మండలం చేయాలని తీర్మానం

- ప్రజావాణిలో కలెక్టర్‌కు అఖిలపక్ష నాయకుల వినతి
- ఇప్పటికే రఘునాథపురం, వేములకొండ కోసం దీక్షలు
- ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళనలు ఉధృతం



సుద్దాల మండలం ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేస్తున్న సుద్దాల అశోక్‌తేజ, గ్రామస్తులు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో నూతన మండలాల డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే రఘునాథపురం, వేములకొండను మండలాలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఐదు నెలలుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించారు. తాజాగా సుద్దాల మండలం తెరపైకి వచ్చింది. గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలం చేయడానికి తమ గ్రామానికి ఉన్న సానుకూల అంశాలను వివరించారు.

12 గ్రామ పంచాయతీలతో..

గుండాల మండలంలోని సుద్దాల గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ గ్రామస్తులతో కలిసి ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. సుద్దాల గ్రామానికి ఉన్న చరిత్ర, ప్రభుత్వ స్థలాలు, ఇతర అనుకూలతలను కలెక్టర్‌కు వివరించారు. బ్రాహ్మణపల్లి, సీతారాంపురం, వెల్మజాల, కొమ్మాయిపల్లి, బుర్జుబావి, అనంతారం, తేర్యాల, పల్లెపహాడ్, పోతిరెడ్డిపల్లి, పారుపల్లి, సారగండ్లగూడెం మొత్తం 12 పంచాయతీలతో మండలం ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు తీర్మానం చేశారు. మండల సాధన కోసం కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్‌లు గూడ ఉపేందర్, సంధ్య, బాలకృష్ణ, ఎంపీటీసీ పాయిలు కవిత, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

కొత్తగా ఏర్పాటైన మండలాలు

జిల్లాల పునర్విభజనలో భాగంగా యాదాద్రి భువనగిరిలోమోటకొండూరు, అడ్డగూడూరు మండలాలు నూతనంగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలని కొంతకాలం పాటు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. దీంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఏర్పాటు కానున్నట్లు అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే ప్రకటించినప్పటికీ ఇంకా అమల్లోకి రాలేదు. ప్రస్తుతం రఘునాథపురం, వేములకొండను మండలాలు చేయాలన్న డిమాండ్‌ను ప్రజలు బలంగా తెరపైకి తీసుకువచ్చారు. తాజాగా సుద్దాల మండలం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించుకునేందుకు అఖిలపక్షం కార్యాచరణ రూపొందిస్తోంది.

రఘునాథపురం మండలం ఏర్పాటయ్యే వరకు పోరాటం



అన్ని అర్హతలు కలిగిన రఘునాథపురాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో గడిచిన ఐదు నెలలుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి ప్రజల న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చాలి. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేసి ప్రభుత్వం దిగి వచ్చేదాకా కొనసాగిస్తాం.

–గుర్రం సిద్ధిరాములు, అఖిలపక్ష నాయకుడు, రఘునాథపురం

అన్ని అర్హతలున్నాయి



సుద్దాల గ్రామానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సుద్దాల హన్మంతు, రామన్నపేట మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి, సీఎం కేసీఆర్ వాస్తు సలహాదారుతో పాటు తాను సుద్దాల వాస్తవ్యులం. గ్రామాన్ని మండలం చేయడానికి అన్ని అర్హతలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఖాళీ స్థలాలు ఉన్నాయి. ప్రజల డిమాండ్‌ను గౌరించాలి.

–సుద్దాల అశోక్‌తేజ, సినీగేయ రచయిత

ఐదు నెలలుగా.. పట్టు వదలకుండా



రఘునాథపురం మండలం కోసం దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మండలంలోని ఇబ్రహీంపూర్‌తో కలిపి మండలం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అధికార బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు, బీఎస్పీ, వివిధ ప్రజాసంఘాలు జేఏసీగా ఏర్పడి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి విన్నవించారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావుకు సైతం వినతిపత్రాలు అందజేసి సహకరించాలని కోరారు. ఐదు నెలలుగా పట్టువదలకుండా మండలం కోసం ప్రయత్నిస్తున్నారు.

రాజాపేట మండలం రఘునాథపురం మండలం చేయాలని అఖిలపక్ష నాయకులు పొట్టిమర్రి వద్ద 153 రోజులుగా దీక్ష చేస్తున్నారు. రాజాపేట మండలంలోని చల్లూరు, బసంతాపురం, కాల్వపల్లి, దూది వెంకటాపురం, యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి, చిన్నగౌరాయపల్లి, సాదువెల్లి, కమటంగూడెం, ధర్మారెడ్డి గూడెం, తుర్కపల్లి

వేములకొండలో 171 రోజులుగా దీక్ష



దీక్ష చేస్తున్న నాయకులు

వలిగొండ మండలంలోని వేములకొండను మండలం చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు సోమవారం నాటికి 171వ రోజుకు చేరాయి. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పరిధిలోని దుప్పెల్లి, నర్సాపురం, చిత్తాపురం, గోపారాశిపల్లి, ముద్దాపురం, వెంకటాపురం, గుర్నాథ్‌పల్లి, లింగరాశిపల్లి గ్రామాలతో కలిపి మండలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి పోరాటం చేస్తున్నారు. రాస్తారోకోలు, ధర్నాలు, వంటావార్పుతో నిరసన తెలుపుతూ ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే మండలంలోని అర్రూర్ గ్రామాన్ని మండలం చేయాలన్న డిమాండ్ కూడా ఉంది.

ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టరేట్ పమేలా సత్పతి



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు వస్తుంటారని, వారిని తిప్పుకోకుండా ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. మొత్తం 38 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధిత 28 వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎంపీ భూపాల్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగేశ్వరాచారి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- భారత దేశ మొట్టమొదటి ముస్లీం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ముస్లీం జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.
- గణతంత్ర వేడుకల సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖలకార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

పనికెళ్తేనే ఉపాధి!

హాజరుకాని కూలీల పేర్లు తొలగింపు

- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ
- మొత్తం కూలీలు 3,47,974
- పనుల్లో భాగస్వామ్యం 1,17,250 మంది
- కొత్త నిబంధనలతో కూలీల్లో ఆందోళన



జిల్లాలో ఇలా..

మొత్తం జాబ్‌కార్డులు **1,65,141**

కూలీలు **3,47,974**

ప్రస్తుతం పనికి వెళ్తున్న వారు **1,17,250**

రామన్నపేట : ఉపాధిహామీ పథకంలో కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల కారణంగా కూలీల్లో ఆందోళన మొదలైంది. ఒక గ్రామంలో 20 పనులకు మించి చేపట్టరాదని, పనులు జరిగే సమయంలో ఉదయం 11లోపు ఒక లైవ్ ఫొటో, మధ్యాహ్నం 2గంటల తర్వాత మరో ఫొటో తీసి ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అంతేకాకుండా జాబ్‌కార్డులో నమోదై పనులకు వెళ్లని కూలీల పేర్లను తొలగించే పనిలో యంత్రాంగం నిమగ్నమయింది. ఈ ప్రక్రియ డిసెంబర్ 20నుంచి కొనసాగుతోంది.

కార్డులు, యూనిట్లు ఇలా..

జిల్లాలో 1,65,141 కుటుంబాలు ఉపాధిహామీ జాబ్‌కార్డులు కలిగి ఉండగా 3,47,974 మంది కూలీలు నమోదై ఉన్నారు. రోజూ ఉపాధి పనులకు వెళ్లేవారు కాకుండా ఇతరులు కూడా జాబ్ కార్డులు తీసుకున్నారు. కరోనా విపత్తు సమయంలో వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు తిరిగివచ్చిన వారు పెద్ద ఎత్తున ఉపాధిహామీ పథకంలో చేరారు. పెళ్లిళ్లు చేసుకొని అత్తగారింటికి వెళ్లిపోయినవారు, మరణించిన, ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి పేర్లు జాబ్‌కార్డుల్లో కొనసాగుతూనే ఉన్నాయి. కొంతమంది పేర్లు అత్తగారు, అమ్మగారి ఇళ్ల వద్ద రెండుచోట్ల ఉన్నాయి. అలాంటి వారికి డబ్బుల చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 79,767 జాబ్ కార్డులకు సంబంధించిన 1,17,250 కూలీలు మాత్రమే ఇప్పటి వరకు ఉపాధిహామీ పనుల్లో భాగస్వామ్యం అయ్యారు. ప్రస్తుతం జాబ్‌కార్డులకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇదే సమయంలో పనుల్లో భాగస్వాములు కాని కూలీల పేర్లను తొలగిస్తున్నారు. ప్రక్రియ పూర్తయ్యేసరికి సగానికిపైగా జాబ్ కార్డులు, కూలీల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

మళ్లీ కార్డు పొందవచ్చు



జాబ్ కార్డులకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆధార్‌ను అనుసంధానం చేయించుకొని పనులకు రావడానికి ఇష్టపడే ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఉంటుంది. ఇప్పుడు తొలగింపబడిన వారు మళ్లీ ఉపాధి పనులకు రావాలంటే జాబ్‌కార్డు జారీ చేస్తాం. ఆందోళన చెందవద్దు.

–మందడి ఉపేందర్‌రెడ్డి, డీఆర్‌డీఓ

కమ్యూనిటీ హాళ్లు త్వరగా పూర్తిచేయండి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

భువనగిరిటౌన్ : కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, తహసీల్దార్లతో సమావేశం అయ్యారు. కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. రూ.16.70 కోట్లతో వ్యయంతో జిల్లా వ్యాప్తంగా 124 కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవన నిర్మాణాల పనులు చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతలో రాజీపడకుండా, జాప్యం చోటు చేసుకోకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ఎంపీ భూపాల్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులా అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి పొందడానికి బీజేపీ కుట్ర'

రామన్నపేట : మత వైషమ్యాలు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందడానికి బీజేపీ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. సోమవారం రామన్నపేటలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాట చరిత్ర కలిగిన తెలంగాణలో మతతత్వ బీజేపీకి చోటులేదన్నారు. బీజేపీ అవలంభిస్తున్న ఆర్థిక, మత, ప్రజావ్యతిరేక విధానాలను గడపగడపకు వివరించాలని సూచించారు. సమావేశంలో మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, బోయిని ఆనంద్, బల్గూరి అంజయ్య, నాగటి ఉపేందర్, కల్లూరి నాగేష్, గన్నెబోయిన విజయభాస్కర్, బడుగు రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భువనగిరి : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి మండలం చందుపట్లలో రూ.40 లక్షల హెచ్ఎండీఏ, ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా చేపట్టిన అంతర్గత బీటీ రోడ్డు విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల గ్రామాలను పట్టించుకోకపోవడంతో అభివృద్ధి జరగలేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో సమగ్రాభివృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, టీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు జనగాం పాండు, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మల్లయ్య, నాయకులు ప్రకాష్, మధుసూన్‌రెడ్డి, వెంకటేష్, కస్తూరి పాండు, కిష్టయ్య, యాదగిరి, ర్యాకల శ్రీనివాస్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కలల వంతెనకు తుది మెరుగులు

మానాయికుంట - శాలిగౌరారం బ్రిడ్జి పూర్తి

- త్వరలో అందుబాటులోకి
- రూ.19 కోట్ల వ్యయంతో నిర్మాణం
- వివిధ ప్రాంతాలకు తగ్గనున్న దూరం



మూసీ నదిలో నుంచి నిర్మించిన వంతెన



కొనసాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

అడ్డగూడూరు : మూసీ నదిపై వంతెన నిర్మించాలని అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల ప్రజలు దశాబ్దాలుగా డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నారు. వారి పోరాటాల ఫలితంగా 2017లో మంజూరైన వంతెన.. నిర్మాణం పూర్తి చేసుకుంది. త్వరలో అందుబాటులోకి రానుంది. తమ కల సాకారం కాబోతుండడంతో రెండు జిల్లాల పరిధిలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2017లో పనులు ప్రారంభం

యాదాద్రి జిల్లా అడ్డగూడూరు - సూర్యాపేట జిల్లా గురుజాల మధ్య మూసీ వాగుపై 2017లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.19 కోట్లు కేటాయించింది. నిధులు చాలకపోవడంతో సకాలంలో పనులు పూర్తి కాలేదు. కొంతకాలం పాటు అప్రోచ్ పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వం మరో రూ.3 కోట్లు విడుదల చేసింది. ఎట్టకేలకు ఏడేళ్ల తర్వాత వంతెన పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేశారు.

నాలుగు ఎకరాల భూ సేకరణ

వంతెనకు ఇరువైపులా డబుల్ రోడ్డు నిర్మిణం కోసం ఆర్అండ్‌బీ అధికారులు భూ సేకరణ చేశారు. సుమారు 650 మీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి 12మంది రైతుల నుంచి 4.01 ఎకరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించడంతో రోడ్డు పనులు సాఫీగా కొనసాగాయి. ప్రస్తుతం మానాయికుంట నుంచి గురజాల వరకు బీటీ పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. మరికొద్ది రోజుల్లోనే వంతెనను ప్రారంభించనున్నారు.

సమయం, ఆర్థికంగా ఆదా

అడ్డగూడూరు మండల ప్రజలు నల్లగొండ జిల్లాకు వెళ్లాలంటే మోత్కూరు, నార్కట్‌పల్లి మీదుగా సుమారు 76 కిలో మీటర్లు తిరిగివెళ్లాలి. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా సమయం వృథా అయ్యేది. బ్రిడ్జిని ప్రారంభిస్తే దూరభారం తగ్గనుంది. అలాగే నకిరేకల్, శాలిగౌరారం నుంచి అడ్డగూడూరు మండలం మీదుగా వరంగల్‌కు సుమారు 55 కి.మీ దూరం తగ్గనుంది.

ఇబ్బందులు తీరుతాయి



మానాయికుంట - గరుజాల మధ్య మూసీ వాగుపై వంతెన లేకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నాం. గత ఏడేళ్ల క్రితం చేపట్టిన పనులు ఎట్టకేలకు పూర్తి కావడంతో వంతెనను త్వరగా ప్రారంభించాలి. వంతెన అందుబాటులోకి వస్తే మూడు జిల్లాల పరిధిలోని ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడం ఆనందంగా ఉంది.

– వల్లంభపట్ల శ్రీనివాస్, గుట్టుసింగారం, అడ్డగూడూరు మండలం

అప్రోచ్ రోడ్డు పనులు నడుస్తున్నాయి

మానాయికుంట - గురజాల మధ్య మూసీ నదిపై నిర్మించిన వంతెన పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఇవి కూడా త్వరలోనే పూర్తి కానున్నాయి. నాలుగైదు నెలల్లో వంతెనను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వంతెన ప్రారంభం అయితే ఈ ప్రాంత ప్రజలకు రవాణాపరంగా ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. ఆర్థిక ఇబ్బందులు తప్పనున్నాయి.

– షహనాజ్, ఇంజనీర్, ఆర్అండ్‌బీ

క్లుప్తంగా

'యాదాద్రి'లో ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసే దిశగా పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి 10గంటల తర్వాత ఆక్టోపస్ బలగాలు ఆలయానికి చేరుకుని మాక్ డ్రిల్ చేపట్టారు. రాత్రి 10గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు ఈ మాక్‌డ్రిల్ కొనసాగింది. ఆలయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై ఆక్టోపస్ బలగాలు స్థానిక అధికారులతో చర్చించారు.

గుంటుకగూడెం తాత్కాలిక సర్పంచ్‌గా శంకరయ్య


తాత్కాలిక సర్పంచ్‌గా శంకరయ్య ఎన్నికైనట్లు ప్రకటిస్తున్న ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్

నిడమనూరు: మండలంలోని గుంటుకగూడెం తాత్కాలిక సర్పంచ్‌గా నాల్గో వార్డు సభ్యుడు శంకరయ్య ఎన్నికయ్యారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన గన్నెపాక స్వామి ఎన్నికైన ఎనిమిది నెలలకే మృతిచెందాడు. దీంతో ఉప సర్పంచ్ అక్కి సరితను తాత్కాలిక సర్పంచ్‌గా నియమించారు. అయితే అక్కి సరితపై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దించారు. ఈ క్రమంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించగా, నాల్గో వార్డు సభ్యుడు గుడిసె శంకరయ్యను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. దీంతో ఆయనే తాత్కాలిక సర్పంచ్‌గా వ్యవహరించనున్నారు. చెక్ పవర్‌పై సంతకం కోసం సీనియర్ వార్డు సభ్యుడు ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

అడ్డగూడూరు: వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తాను తుంగతుర్తి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉండి ప్రతి గ్రామంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించినట్లు తెలిపారు. తన పనితనాన్ని గుర్తించి సీఎం కేసీఆర్ 2016లో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించారని అన్నారు. రైతాంగ అభివృద్ధి కోసం తన సొంత మండలం అడ్డగూడూరులోని చౌల్ల రామారం గ్రామశివారులో గల ప్రభుత్వ భూమిలో 15 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంలను మంజూరు చేయించి 2020 జూలై 12న శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను ఆహ్వానించినా వారు రాలేదని అన్నారు. కానీ ఆదివారం నిర్వహించిన గోదాంల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ చైర్మన్‌నైన తనను ఆహ్వానించకుండా అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరనున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


డైరీ ఆవిష్కరిస్తున్న యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, బీర్ల అయిలయ్య, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

భువనగిరి: విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327, ఐఎన్‌టీయూసీ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు విద్యుత్ ఉద్యోగులు ముందంజలో ఉంటారన్నారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ యూనియన్-327 అధ్యక్షుడు, ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి. రఘుమారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ మంత్రితో సంప్రదించి 2022లో ఇవ్వావల్సిన పీఆర్‌సీ విషయంలో నిర్ణయం తీసుకునే విధంగా కృషిచేస్తామన్నారు. బొగ్గు ధర, రవాణా ఖర్చులు పెరిగి సంస్థపై భారం పడటం వల్ల వేతనాలు చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పారు. భూగర్భ జలాలు పెరగడం వల్ల వ్యవసాయంలో సాగు విస్తీర్ణం పెరగడంతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సంస్థలో వచ్చే ప్రతి సమస్యకు కార్మికులు కారణం కాదని యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వల్లనే వస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సంస్థకు ముఖ్యమని వారికి సేవలందించడంతో ఉద్యోగులు ముందుండాలని అన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన నాసా విధానం వల్ల సంస్థకు రూ.కోటి ఆదాయం వచ్చిందన్నారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బీర్ల అయిలయ్య, ఇనుగుల శ్రీధర్, సురేష్ కుమార్, భూపాల్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనాథ్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఐలయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్, కార్యదర్శులు నర్సింగ్‌రావు, బండారు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో పత్తి రైతు ఆత్మహత్య


ఉరి వేసుకున్న శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం : కాలం కలిసిరాలేదు.. వాతావరణం అనుకూలించలేదు.. పత్తిపంట సాగు చేసిన ఓ రైతు దిగుబడులు రాక పంట సాగుకోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక పంటచేనులో చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో ఆదివారం జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. అందుకు సంబంధించి బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెర్కకొండారం గ్రామానికి చెందిన కాసర్ల శేఖర్‌రెడ్డి(65) తనకున్న మూడెకరాల భూమితో పాటు గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తిపంటను సాగుచేశాడు. పంటసాగు కోసం బంధువులు, గ్రామస్తుల వద్ద సుమారు రూ.10 లక్షలు అప్పులు చేశాడు. అధిక వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి రాలేదు. దీంతో పంటసాగుకోసం చేసిన అప్పులు తీర్చేందుకు తరచూ మనోవేదనకు గురవుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం తన బంధువుల ఊరికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో చెట్టుకు విద్యుత్ కేబుల్‌వైర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన మృతుడి అన్న కొడుకు కాసర్ల రవీందర్‌రెడ్డి తన బాబాయి శేఖర్‌రెడ్డి మృతిచెంది చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కుటుంబీకులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు కాసర్ల వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలుశిక్ష


నిందితులు పూలమ్మ, స్వామి, నవీన్

అడ్డగూడూరు: హత్యాయత్నం కేసులో మండల పరిధిలోని డి.రేపాక గ్రామానికి చెందిన ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూవివాదంలో భాగంగా 2014 సంవత్సరంలో డి.రేపాక గ్రామానికి చెందిన గ్యార స్వామి, గ్యార పూలమ్మ, సూరారం నవీన్ కలిసి అదే గ్రామానికి చెందిన గ్యార స్వరూప మీద కత్తితో దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి అసిస్టెంట్ స్పెషన్స్ కోర్టులో సోమవారం ఈ కేసు తుది విచారణ జరగ్గా ముగ్గురిపై నేరం రుజువు కావడంతో వారికి 5సంవత్సరాల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. దీంతో ముగ్గురు నిందితులును జైలుకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకుండా మోసం

- రైస్‌మిల్లు యజమానుల రిమాండ్

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వానికి కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా మోసం చేసిన కేసులో మిర్యాలగూడ మండలంలోని వజ్ర రైస్‌మిల్లు యాజమానులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చగా వారిని 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి తీర్పునిచ్చారు. రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ, ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020-21 రబీ సీజన్‌కు గాను ధాన్యాన్ని సీఎంఆర్ చేసి ఎఫ్‌సీఐకి పంపే విధంగా తెలంగాణ సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ వారు మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లికి చెందిన వజ్ర రైస్ మిల్లుకు రూ.7.89 కోట్ల విలువ చేసే 4339.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించారు. కానీ వజ్ర రైస్ మిల్లు యాజమాన్యం సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఆర్ యాక్ట్‌ను అమలు చేశారు. ఈ మేరకు నిల్వ ఉన్న ధాన్యాన్ని వేలం వేయడంతో రూ.కోటి ప్రభుత్వం దక్కించుకోగా, సుమారు రూ.5.90 కోట్ల వరకు వజ్ర రైస్ మిల్లు వారు సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ వారికి ఇవ్వాల్సి ఉంది. కానీ ఉద్దేశపూర్వకంగానే సీఎంఆర్ చేయకుండా ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గతేడాది అక్టోబర్‌లో వజ్ర రైస్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ వజ్ర అపర్ణ, వజ్రపు అనురామ్, సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

ఆలేరురూరల్: రైలు ఢీకొని గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. భువనగిరి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కాంతారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరులోని శాంతినగర్‌కు చెందిన దయ్యాల బుచ్చమ్మ(65) సోమవారం ఉదయం పట్టణంలోని రైల్వే అండర్ పాస్ సమీపంలో పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


రమావత్ గంగ్యా (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు జారిపడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ట్యాంకుతండాకు చెందిన రమావత్ గంగ్యా(48) యాదాద్రి జిల్లా వలిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు వలిగొండకు వెళ్లి శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో మిర్యాలగూడకు తిరిగి వస్తున్నాడు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు దిగుతూ జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. రైలు డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు వెంటనే అక్కడకు చేరకుని అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు.

కరెంట్ హీటర్ తగిలి మహిళ మృతి


ఆమని (ఫైల్)

సూర్యాపేట క్రైం: కరెంట్ హీటర్ తగిలి మహిళ మృతిచెందిన ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్ 39వ వార్డులో నివాసముంటున్న టింగిల్‌కార్ ఆమని(27) ఇంట్లో కరెంట్ హీటర్ పెట్టబోయి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

నాగారం: గుర్తుతెలియని వ్యక్తులు కూల్‌డ్రింక్ షాపులో చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి నాగారం బంగ్లా వద్ద చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన కన్నెబోయిన అనిల్ వర్ధమానుకోటకు వెళ్లేదారిలో వైన్స్ ఎదురుగా కూల్‌డ్రింక్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం రాత్రి 10గంటల తర్వాత దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పు రేకులను తొలగించి లోపలకు చొరబడి రూ.20వేల నగదుతో పాటు కూల్‌డ్రింక్స్ ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ఎదురుగా ఉన్న రెడ్డి దాబాలో రెండు సిలిండర్లను చోరీ చేసినట్లు దాబా యజమాని రవీందర్‌రెడ్డి తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు అనిల్, రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని ఏనుబాముల గౌడ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఏనుబాముల గౌడ సంఘం అధ్యక్షుడు పసునూరి తిరుమలేష్, నాయకులు గిలకత్తుల సర్వయ్య గౌడ్, పసునూరి లక్ష్మయ్య, వత్సవాయి శ్రీరాములు, తండు అంజయ్య, వత్సవాయి అయోధ్య, అండం నాగరాజు, పసునూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

అవంతీపురం గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


ఖాళీ బిందెలతో ఆర్డీఓ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్తున్న సీపీఎం నాయకులు, అవంతీపురం గ్రామస్తులు

మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి అవంతీపురం నుంచి మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు పక్కా ఇళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవంతీపురం కొత్త కాలనీలోని ప్రజలు విష సర్పాలతో సహజీవనం చేస్తూ వాటికి బలైపోతున్నారని అన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, పాదూరి గోవర్ధని, ఊర్మిళ, లింగయ్య, కుందుకూరు రమేష్‌బాబు, పిల్లుట్ల సైదులు, గోవిందరెడ్డి, రామకృష్ణ, కోటయ్య, వెంకన్న, మోతె సైదులు, శివ, వెంకన్న, జ్యోతి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, మిషన్ భగీరథ కార్మికులు

నల్లగొండ: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. గత 16 సంవత్సరాలుగా గ్రామీణ నీటి సరఫరా విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న మిషన్ భగీరథలోకి మార్పు చేశారు తప్ప.. వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు లేవని అన్నారు. ప్రతినెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిందని ఆరోపించారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జంజరాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలని అన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, యూనియన్ జిల్లా నాయకులు, గుర్రాము వెంకటేష్, కుర్తాల సైదులు, ఉయ్యాల మురళి, కర్నాటి వెంకన్న, ఉయ్యాల ఆంజనేయులు, దాసరి మల్లేష్, వేముల సైదులు, సింగం రమేష్, ఏర్పుల కృష్ణ, వేణునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లతామర తెగులు గుర్తించి నిర్మూలించాలి


రావులపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఉద్యాన శాఖ అధికారి స్రవంతి

తుంగతుర్తి: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులును మొదటి దశలోనే గుర్తించి నిర్మూలించాలని, మిరప సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూర్యాపేట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి స్రవంతి అన్నారు. మండల పరిధిలోని రావులపల్లిలో సాగుచేసిన మిరప పంటను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. నల్లతామర తెగులు నివారణకు లీటరు నీటికి 10వేల పీపీఎం వేపనూనె, 3మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు. జీవ నియంత్రణ శిలీంద్రాలైన బవేరియా బాషియాన లేదా లెకానిశీలియం లేఖలి 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరు కుళ్లు నివారణతో పాటు ఇతర మిరప తోటలకు వచ్చే ముడత, పువ్వు రాలడం, పింద రాలడం వంటి వాటికి ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ నల్లగొండ పట్టణం సాగర్‌రోడ్ మారుతినగర్ ఇంద్రారెడ్డి రైస్‌మిల్ వెనుక 22.5 x 50 పడమర ఫేస్ ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ సెల్ : 9948281402 [Y-772725]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776250]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888, 7569955551. [HA-786818]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మా కంపెనీ ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 76748 10229 [V- 6034]

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

Services

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1741]

GOLD FINANCE

■ సంప్ర. సెల్: 79977 89771, బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ దరకు కొనబడును. స్పాట్ క్యాష్. (100% జెన్యూన్) [B-798]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాల బాట

- నాలుగెకరాల్లో జీరో బడ్జెట్‌తో వరి, కూరగాయలు, ఆకుకూరలు సాగు
- సహజ సిద్ధమైన కషాయాలు వాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న వెంకటరెడ్డి, కవిత దంపతులు

పాడి పంట


తన వ్యవసాయ క్షేత్రంలో వెంకటరెడ్డి సాగుచేసిన దేశవాళీ వరి పంట

నడిగూడెం: ఎలాంటి పెట్టుబడి లేకుండా జీరో బడ్జెట్ విధానంలో గత 10 సంవత్సరాలుగా తనకున్న నాలుగు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు నడిగూడెం మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి, కవిత దంపతులు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు డాక్టర్ పాలేకర్ వద్ద రెండు సార్లు శిక్షణ పొంది రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా గోఆధారిత వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరి, వేరుశనగ, కంది, పెసర, పసుపు పంటతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సహజ సిద్ధంగా పండిస్తున్నారు. భూసారం పెరిగేందుకు నవ ధాన్యాలు సాగు చేస్తున్నారు. అదేవిధంగా వీరికి అనారోగ్య సమస్యలు ఎదురైతే ఇంట్లోనే గోఆధారిత ఉత్పత్తులు వాడుతూ, రోగనిరోధక శక్తిని తట్టుకునే ఆహారం తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అంతేకాకుండా వెంకటరెడ్డి పెంచుతున్న రెండు ఎద్దులు, నాలుగు ఆవులు, రెండు దూడలకు కూడా నాణ్యమైన గ్రాసం అందిస్తూ, ఎటువంటి యంత్రాలు వాడకుండా ఎద్దులు, ఆవులతోనే భూమి దున్ని పంటలు సాగు చేస్తున్నాడు. వ్యవసాయంలో వస్తు రవాణాకు ఎడ్లబండిని కూడా ఉపయోగిస్తున్నారు. తన పొలంలో పండిన పంటను చుట్టుపక్కల గ్రామాల వారికి అమ్ముతూ ఎటువంటి పెట్టుబడి లేకుండా లాభాలు ఆర్జిస్తున్నారు.

దేశవాళీ వరి రకాల సాగు..

వెంకటరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో విత్తన అభివృద్ధి కోసం ఒక ఎకరంలో దేశీ వరి రకాలైన నవారా, చిట్టిముత్యాలు, సిద్ధ సన్నాలు, రత్నచోడి, కె3 మహారాజ్, మైసూరు మల్లిక, బాస్మతి తదితర రకాలు సాగు చేస్తూ ఆ విత్తనాలను చుట్టుపక్కల వారికి విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

చీడపీడల నివారణకు కషాయాల తయారీ

వివిధ రకాల కషాయాలను ఉపయోగించి పంటలకు ఆశిస్తున్న చీడపీడల నివారిస్తున్నారు. జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, అగ్నిహస్త్రం, దశపర్ణి, వేపగింజలు, భీజామృతం, మట్టిద్రావణం, బవేరియా బాసియానా, వర్టిసిల్లం, మెటారైజం తదితర ద్రావణాలు, పదార్థాలను సొంతంగా తయారు చేసుకుని చీడపీడల నివారణకు, భూసారం పెరిగేందుకు ఉపయోగిస్తున్నాడు.

జీవామృతంతో ఆరోగ్యంగా పంట

జీవామృతం ఉపయోగిస్తే పంట ఆరోగ్యంగా పెరుగుతుందని వెంకటరెడ్డి దంపతులు చెబుతున్నారు. 5లీటర్ల గోమూత్రం, 10కిలోల పెండ, 2కిలోల పాత బెల్లం, 2 నుంచి 4కిలోల పప్పు ధాన్యాల పిండి, పిడికెడు పుట్ట మట్టి, 200లీటర్ల నీటిని కలిపి రెండు రోజుల పాటు మురగబెట్టి తయారు చేసిన కషాయాన్ని నేరుగా ప్రతి 15రోజులకు ఒకసారి పంట మొదళ్లు తడిసేలా చల్లితే ఎటువంటి చీడపడలు ఆశించవని పేర్కొంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వలన భూసారం తగ్గి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని, కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వెంకటరెడ్డి, కవిత దంపతులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

నాకున్న నాలుగు ఎకరాల భూమిలో గత 10 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ పితామహుడు పాలేకర్ స్ఫూర్తితో జీరో బడ్జెట్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాము. ఎలాంటి ఖర్చులు లేకుండా వరి, వేరుశనగ, కంది, పెసర, పసుపు పంటలతో పాటు ఇంటి అవసరాలకు వంగ, టమాట, ఆకు కూరలు సాగు చేస్తున్నాను. మాలాంటి చిన్న, సన్నకారు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఇంకా గ్రామాల నుంచి రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలి. ప్రతి రైతు కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి. – నాగిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపురం


కషాయం తయారు చేస్తున్న వెంకటరెడ్డి, కవిత దంపతులు